ప్రజాశక్తి

బుధవారం 13 నవంబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

పంచుమర్తి అనురాధ, బొండా ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, యార్లగడ్డ వెంకట్రావు

మండలిలో చీఫ్‌విప్‌గా పంచుమర్తి

అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా బొండా, తంగిరాల, యార్లగడ్డ

ప్రజాశక్తి - నందిగామ, విజయవాడ, గన్నవరం : రాష్ట్ర శాసన మండలిలో చీఫ్‌విప్‌గా విజయవాడకు చెందిన ఎంఎల్‌సి పంచుమర్తి అనురాధ నియమితులయ్యారు. అలాగే శాసనసభలో ప్రభుత్వ విప్‌లుగా ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలకు చెందిన విజయవాడ సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు (టిడిపి), నందిగామ (ఎస్‌సి) ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య (టిడిపి), గన్నవరం ఎంఎల్‌ఎ యార్లగడ్డ వెంకట్రావు (టిడిపి) నియమితులయ్యారు. వీరి నియామకం పట్ల పలువురు ప్రముఖులు, టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నందిగామ గాంధీ సెంటర్, రైతుపేట సెంటర్లో పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రజలకు స్వీట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంఎల్‌ఎలు బొండా ఉమా, సౌమ్యలు రెండుసార్లు ఎంఎల్‌ఎలుగా గెలుపొందారు. యార్లగడ్డ మొదటిసారిగా ఎంఎల్‌ఎగా గెలుపొందారు. పంచుమర్తి అనురాధా గతంలో విజయవాడ మేయర్‌గా పనిచేశారు.

14న జాబ్ మేళా

వార్త 2లో

స్మార్ట్ మీటర్ల అడ్డగింత

వార్త మెయిన్‌లో

స్మార్ట్ షాక్

- మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ భారాలు
- ప్రక్రియ వేగవంతంతో వినియోగదారులపై మరింత భారం
- ప్రతి నెలా ఛార్జీలతోపాటు ఇఎంఐలా ఖర్చు మొత్తం వసూలు !



ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ వినియోగదారులపై మరో పెనుభారం పడటానికి ఎంతో సమయం లేదు. త్వరలోనే ఇంటి గుమ్మంలోకి స్మార్ట్ మీటర్లు రాబోతున్నాయి. ట్రూ అప్ ఛార్జీల మోత రూ.17 వేల కోట్ల భారం మరవక ముందే... ప్రీ పెయిడ్ స్మార్ట్‌మీటర్ల 'భూతం' నగర ప్రజలను భయపెడుతోంది. ఇప్పటికే విజయవాడ నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నగరపాలక సంస్థకు సంబంధించిన వివిధ కార్యాలయాలతోపాటు ఇతర కార్యాలయాల్లో కూడా వేలాది స్మార్ట్ మీటర్లను విద్యుత్ అధికారులు ఇప్పటికే అమర్చారు. మున్సిపల్ కార్యాలయాలకే ఐదారు వేలు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఒప్పందం ప్రకారం తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, ఆ తర్వాత కాంప్లెక్స్‌లు, అనంతరం నివాస గృహాలకు ఇలా క్రమంగా 2025లోపు నగరవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈనేపథ్యంలో విద్యుత్ అధికారులతో కలిసి అదానీ కంపెనీ సిబ్బంది విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ప్రారంభించారు. నగర వ్యాప్తంగా గృహాలకు సుమారు 95 వేల మీటర్లు, అలాగే క్యాటగిరీ-2 (కాంప్లెక్స్‌లు, షాపులు) కింద మరో 70 వేల మీటర్ల వరకు బిగించాలని ప్రభుత్వాధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గృహాల్లో కూడా 200 యూనిట్లకుపైగా వినియోగించుకుంటున్న గృహాలకు ముందుగా వీటిని ఏర్పాటు చేస్తారు. దశలవారీగా జరగాల్సిన ఈ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం కమర్షియల్ కాంప్లెక్స్‌లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే పని వేగంగా జరుగుతోంది. ఇప్పటికే అరండల్‌పేట ప్రాంతంలో వ్యాపార సముదాయాల కాంప్లెక్స్‌లకు నాలుగైదు వేల వరకు స్మార్ట్ మీటర్లను బిగించారు. గాంధీనగర్ రాజ్-యువరాజ్ థియేటర్ సమీపంలోని దత్త కాంప్లెక్స్‌లో రెండు స్మార్ట్ మీటర్లు బిగించారు. ఇదే కాంప్లెక్స్‌లో పదుల సంఖ్యలో ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యుత్ వినియోగదారులు మంగళవారం సిపిఎం నేతలకు సమాచారం ఇవ్వడం, పార్టీ శ్రేణులు, రంగంలోకి దిగి వినియోగదారులతో కలిసి నిరసనకు దిగడం జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఇఇ రవీంద్రబాబు తెలిపారు. ఎప్పుడు వినియోగించుకున్న విద్యుత్‌కు నష్టాల పేరుతో ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల పేరుతో మొత్తం రూ.17 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నెల బిల్లులతోనే ఆ భారాలు ప్రజలపై పడడం ప్రారంభమైంది. రూ.1.50 నుండి రూ.4 వరకు యూనిట్‌కు అదనంగా వసూలు చేస్తారు. ఛార్జీల భారం ఇలా ఉంటే... ఒక్కో స్మార్ట్ మీటర్ ఖరీదు గృహాలకైతే రూ.13 వేలు, కమర్షియల్ అయితే (మిగతా 2లో)

దాళ్వాకు అనుమతిపై సందేహాలు

- నేటికీ నోరు మెదపని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నాలుగు రోజులుగా రైతుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-పెడన

కోస్టల్ జోన్‌లో ఉన్న పెడన నియోజకవర్గానికి గత ఏడేళ్లుగా దాళ్వా పంటకు నీరు ఇవ్వడం లేదు. ఏడాదికి ఒక పంటే (ఖరీఫ్) సాగు కావడంతో భూమి సారవంతం తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గత రెండు నెలలుగా అధికారులు, ఎమ్మెల్యేతో సహా వినతి పత్రాలు కూడా సమర్పించారు. అంతేకాకుండా గత నాలుగు రోజులుగా రిలే దీక్షలు కూడా చేపట్టారు.

పెడన నియోజవర్గ పరిధిలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండో పంట రబీ (దాళ్వా)కు సాగునీరు అందిస్తారో లేదో అన్న సందిగ్ధంలో రైతులున్నారు. ఏడేళ్లుగా ఈ నియోజకవర్గంలో దాదాపు 50 వేల ఎకరాలకు పైగా రెండో పంటకు నోచుకోవడం లేదు. దీంతో రైతులు, కూలీలు పనులు లేక వలసలకు వెళ్లిపోతున్నామంటూ బోరును విలపిస్తున్నారు. ఈసారైనా దాళ్వా పంటకు అనుమతి ఇవ్వాలని రైతులతో పాటు రైతు సంఘాల నాయకులు కూడా సంఘీభావం తెలుపుతూ బంటుమిల్లిలో రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. అసలే సముద్ర తీర ప్రాంతం కావడంతో చౌడు భూములు అధికంగా ఉన్నాయి. వీటిలో రెండు పంటలు పండించుకోకపోతే భూమి సారవంతం తగ్గి ఖరీఫ్ (సార్వ) దిగుబడి గణనీయంగా పడిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై గత రెండు నెలల నుంచి పెడన మండల పరిధిలోని కాకర్లమూడి, నందమూరు, జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాలతో పాటు పలు గ్రామాల ద్వితీయ శ్రేణి నాయకులు, రైతులు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. దీనిపై ఆయన స్పందించకపోవడంతో రైతులు దీనస్థితికి చేరుకున్నారు. అంతే కాకుండా జిల్లా, మండల స్థాయి అధికారులు కూడా వినతి పత్రాలను సమర్పించారు. అయినప్పటికీ అధికారికంగా ప్రకటన రాకపోవడంతో గత నాలుగు రోజులుగా బంటుమిల్లి మండలంలో బంటుమిల్లి లోని లక్ష్మీపురం సెంటర్లో రైతు కూలీల సంఘ నేతలతో పాటు రైతులు, కౌలు రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. అయినప్పటికీ వ్యవసాయ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కానీ ఏ ఒక్కరు సంఘీభావం తెలిపి సరైన ప్రకటన ఇవ్వకపోవడంతో ఈ దీక్షను మరింత ఉధృతం చేస్తామంటూ రైతులు పేర్కొంటున్నారు.

దీక్షలో పాల్గొన్న రైతులు, కౌలురైతులు

నాలుగేళ్లుగా కోరుతున్నాం

గొరిసెట్టి నాగేశ్వరరావు, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

గత నాలుగేళ్లుగా దాళ్వా పంట కోసం పోరాటాలు చేస్తున్నాం. రెండు నెలల ముందు నుంచే సంబంధిత అధికారులు, నాయకులకు వినతి పత్రాలను సమర్పించాం. కోస్టల్ ఏరియాలో ఈ భూములు ఉండటం వల్ల ఇప్పటికే చౌడు బారిపోతున్నాయి. ఇదే జరిగితే రానున్న రోజుల్లో కూలీలు, కౌలు రైతులతో పాటు రైతులు కూడా వలసలకు వెళ్ళి పోవాల్సిందే.

అందరికీ వినతిపత్రాలు ఇచ్చాం

వెంట్రపాటి సురేష్, రైతు

ఏడేళ్లుగా దాళ్వా పంటకు నీరందించాలని అడుగుతూనే ఉన్నాం. రెండు నెలల నుంచి అధికారుల, రాజకీయ నాయకులకు వినతిపత్రాలను సమర్పించాం. ఇప్పటికే ఒక పంట కావడంతో భూములు చౌడు బారిపోతున్నాయి. ఇదే జరిగితే రానున్న రోజుల్లో పెడన నియోజకవర్గంలో వ్యవసాయం కనుమరుగు అవుతుంది. త్వరలో స్పష్టమైన హామీ రాకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సిందే.

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు !

- మైలవరంలో వైసిపి, టిడిపి నేతల పరస్పర ఆరోపణలు
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి - జి.కొండూరు : రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరని నానుడిని మైలవరం నియోజకవర్గ రాజకీయ నేతలు నిజం చేస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ రాజకీయ నాయకుల పరిస్థితి ఇలానే ఉంది. "నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు" అన్న చందంగా మారింది. ఇటీవల కొద్దిరోజులుగా మైలవరంలో వైసిపి నియోజక ఇన్చార్జి జోగి రమేష్, ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ మధ్య కొనసాగుతున్న విమర్శల పరంపర దీనికి అద్దం పడుతోంది. ఈనెల 6న వైసిపి నేత జోగి రమేష్ మైలవరం నియోజకవర్గ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి తిరిగి ఇన్చార్జిగా నియమితులైన తర్వాత పార్టీ కార్యకర్తలతో ఆయన నిర్వహించిన ఆత్మీయ సమావేశమే మొదటిది. ఈ సందర్భంగా జోగి మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయలను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని ఎంఎల్‌ఎ వసంతనుద్దేశించి విమర్శలు చేశారు. మరుసటి రోజున మైలవరంలో ఓ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఎ వసంత మాట్లాడుతూ జోగి రమేష్ ఒక గొంగళిపురుగు లాంటివారని ఎద్దేవా చేశారు. మంత్రిగా పనిచేసిన జోగి అటు రాష్ట్రానికిగానీ, ఇటు సొంత నియోజకవర్గమైన మైలవరానికిగానీ చేసిందేమీలేదని విమర్శలు గుప్పించారు. సొంత సామాజిక వర్గానికి చెందిన వారి దగ్గరే ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన ఘనత జోగిదేనని కౌంటర్ ఇచ్చారు. దీనికి కొనసాగింపుగా ఈనెల 8న జోగి తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ సహజ వనరులను లూటీ చేసి ఆ అవినీతి సొమ్ముతో 2024 (మిగతా 2లో)

ప్రతి గ్రామానికీ కృష్ణా జలాలు అందించాలి

•సిపిఎం విస్సన్నపేట మండల మహాసభ తీర్మానం

•నూతన కార్యదర్శిగా వి.నాగరాజు మళ్లీ ఎన్నిక

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండలంలోని ప్రతి గ్రామానికి తెల్లదేవరపల్లి పైలెట్ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను అందించాలని, పిట్లవారిగూడెం ఎత్తిపోతల పథకం ద్వారా తాగునీరు, సాగునీరు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సిపిఎం విస్సన్నపేట మండల 8వ మహాసభ తీర్మానించింది. సోమవారం జరిగిన మండల మహాసభలో 14 అంశాలను ఆమోదించారు. మహాసభ వివరాలను స్థానిక సుందరయ్య భవన్లో పార్టీ మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు మంగళవారం మీడియాకు వివరించారు. అర్హులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని, విస్సన్నపేటకు బైపాస్ రోడ్డు నిర్మించాలని, మెయిన్ రోడ్డుకు మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని మహాసభ తీర్మానించింది. రైతు బజార్ ఏర్పాటు చేయాలని, ఉపాధి కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.500 ఇవ్వాలని, అటవీ భూమి సాగుదారులకు పట్టాలివ్వాలని, మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, మండలంలో కోతులు కుక్కల బెడదను నివారించాలని తీర్మానించినట్లు నాగరాజు తెలిపారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్

ఉద్యోగులు, స్కీం వర్కర్ల కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని, గ్రామాల్లో స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని, విస్సన్నపేటలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, మంచినీటి పైపులైను మార్చాలని కోరింది.

మండల నూతన కార్యదర్శిగా మళ్లీ నాగరాజు ఎన్నిక

సిపిఎం విస్సన్నపేట మండల కార్యదర్శిగా విస్సంపల్లి నాగరాజును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మండల కమిటీ సభ్యులుగా మేకల జ్ఞానరత్నం, కరెడ్ల ధనలక్ష్మి, గద్దల రామకష్ణ, వినుకొండ రంగారాణి, మోరంపూడి రామారావు, పులిబల్ల ఏడుకొండలు, ఎస్‌కె.బాజీ, గద్దల రాము, కోలేటి రమేష్, ఆడిమిల్లి కిషోర్ ఎన్నికయ్యారు.

14న జాబ్ మేళా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 14న నగరంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు (ఎఫ్‌ఎసి), జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ విద్యాధరపురం రోటరీనగర్ కబేళా భవనం సమీపంలోనిబిసి సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌లో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్‌ఎసి) శిక్షణా కేంద్రంలో ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. ఈ మేళాలో Urban సంస్థ, ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌బిఐ కార్డ్స్), అపోలో ఫార్మసీస్ లిమిటెడ్, ఎస్‌బిఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫెయిర్ డయల్ కాపిటల్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీల్లో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుండి 60 సంవత్సరాలలోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.12, వేల నుండి రూ.40 వేల వరకు వేతనంతోపాటు పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా https://tinyurl.com/job-mela-naipunyam లింక్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, సదరు జాబ్ మేళాకు రెజ్యూమ్‌లతో లేదా బయోడేటా ఫోరమ్‌లతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, మరిన్ని వివరాలకు 9700025833 నంబరులో సంప్రదించాలని కోరారు.

అన్న క్యాంటీన్లలో అసౌకర్యం లేకుండా చూడండి

ప్రజాశక్తి - విజయవాడ : అన్న క్యాంటీన్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్లతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని 11 అన్న క్యాంటీన్లకుగాను 11 నోడల్ ఆఫీసర్లను నియమించగా, ఉదయం 7 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 11 వార్డ్ వెల్ఫేర్ / ఏమినిటీస్ సెక్రెటరీలను, మధ్యాహ్నం మూడు నుండి రాత్రి 9 గంటల వరకు మరో 11 వార్డ్ వెల్ఫేర్ / ఏమినిటీస్ సెక్రటరీలను అన్న క్యాంటీన్ల నిర్వహణ, పర్యవేక్షణకు గాను నియమించారు. వారితో టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలివ్వండి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గ్రామ పంచాయతీ కార్మికులకు జిఓలు 551, 57, 132, 142, 680 అమలు చేయాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ముఖ్య కార్యదర్శి కె.శశిభూషణ్‌కుమార్‌ను మంగళవారం సచివాలయంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర, పలు జిల్లాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయితీ కార్మికులకు గుర్తింపుకార్డు, కనీసవేతనం, పిఎఫ్, ఇఎస్‌ఐ పై వారీ పథకాల అమలుతో పాటు ప్రతి ఏటా టెండర్లు విధానం ద్వారా నియామకాలు జరపాలని పేర్కొనగా, ఆనాటి నుండి కేవలం టెండర్ విధానం మాత్రమే అమలుచేస్తూ మిగిలిన పథకాలు అమలు చేయడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.ఉమామహేశ్వరరావు, డి.వెంకట్రామయ్య, పోలినాయుడు, శివప్రసాద్, ఎస్.సురేంద్రబాబు, ఎం.భాగ్యరాజు ఉన్నారు.

వీరబాబుకు నివాళి

ప్రజాశక్తి - చల్లపల్లి : జనసేన పార్టీ నాయకులు, గ్రామ ప్రముఖులు విన్నకోట వీరబాబు గుండెపోటుతో మరణించారు. చల్లపల్లి గ్రామంలోని నడకుదురు రోడ్డులోని స్వగహంలో వీరబాబు భౌతిక కాయాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, జనసేన నాయకులు బి.వీరబాబు, జీవీ తాతారావు తదితరులు నివాళులర్పించారు.

మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ వాయిదా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఈనెల 14న అన్ని పాఠశాలల్లో జరగాల్సిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

పదవ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణానికి చెందిన నాళ్ళ వెంకట సాయికృష్ణ విశాల్ గుప్తా తండ్రి విశ్వనాధం సంబంధించిన పదవతరగతి ఒరిజినల్ మార్కుల ప్రొవిజనల్ సర్టిఫికెట్ పోయినది. సర్టిఫికెట్ రోల్ నెం. 2313118803.నవంబరు 9వ తేదీన జిరాక్స్ నిమిత్తము ఇంటి నుండి నందిగామ గాంధీ సెంటర్ కు బైక్‌పై వెళ్లుచుండగా మార్గమధ్యంలో సర్టిఫికెట్ పోయినది. సదరు ఒరిజినల్ పదవతరగతి సర్టిఫికెట్ దొరికిన యెడల సెల్ నెం.9849190678కి ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

మహారాజశ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

Ep: 131/ 2015 in O.S. 262/2013

Between:
Kamineni Uma Rajeswari - Decree Holder
and
Divvela Lakshmi Narayana-Judgement Debtor

వేలము ప్రకటన

ది. 13-12-2024 తారీఖున పై కోర్టు వారి ఎదుట ఉ॥ 10.30 ని॥లకు పై చెప్పిన **EP.No. 131/2015 in O.S. 262/2013** తారీఖున **Judgement Debtor** తాలూకు ఈ క్రింద తెల్పిన షెడ్యూల్ ఆస్తిని బహిరంగ వేలము వేయుటకు కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు కావున వేలములో పాల్గొను వారు 13-12-2024 తారీఖున నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఉ॥ 10.30 ని॥లకు వేలము పాటలో షెడ్యూల్ ఆస్తి విషయములో వేలంపాట పాడు కొనవచ్చును. కావున తెలియచేయడమైనది.

EP షెడ్యూల్: యన్.టి.ఆర్. జిల్లా (కృష్ణా) నందిగామ సబ్ రిజిస్ట్రార్ యిలాకా, నందిగామ గ్రామంలో.

Item No-1: యన్.టి.ఆర్ జిల్లా (కృష్ణా) నందిగామ సబ్ రిజిస్ట్రార్, నందిగామ గ్రామం **RS.No.** 440/2 మరియు 453/1 లోని 0.36 3/5 సెంట్ల మేరకు భూమికి **హద్దులు: తూర్పు:** మాజేటి కనకదుర్గాంబ, **పడమర:** ల్యాండ్ **RS No.** 440/2, **ఉత్తరం:** ల్యాండ్ **RS No.** 440/2, **దక్షిణం:** ట్రంకు రోడ్డు.

Item No-2: యన్.టి.ఆర్ జిల్లా (కృష్ణా) నందిగామ సబ్‌రిజిస్ట్రార్, నందిగామ గ్రామం తాలూకా **RS No.2** 440/2 మరియు 453/1 లోని 1.46 2.5 సెంట్ల మెరక భూమికి **హద్దులు: తూర్పు:** మాజేటి కనకదుర్గాంబ, **పడమర:** ల్యాండ్ **RS No.** 440/2, **ఉత్తరం:** ట్రంకు రోడ్, **దక్షిణం:** **RS No.** 440/2.

ఇట్లు, **వేమూరి సత్యనారాయణమూర్తి,**
V.V.L.N. PURNESH
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాదులు, నందిగామ
నందిగామ, ది. 11-11-24

In the court of the Hon□ble VII Addl. District Judge at Vijayawada.
E.P. No. 767/2023 in
A.O.P. No. 1475/2012

Between :
M/s... Rep by authorized signatory
... DHR/ Claimant
AND
1) Yerramsetty Satish Kumar
2) Yenugu Ramesh Babu
... JDr□s/ Respondent

పై నెంబరు ఆర్బిట్రేషన్ ఇ.పి. నెం. 767/2023లో జెడిఆర్ 1 మరియు 2 అయిన మీకు హాజరు నిమిత్తం పైన తెలిపిన కోర్టులో ది. 6-12-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున జెడిఆర్ 1 మరియు 2 అయిన మీకు ది. 6-12-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరుగారి ద్వారా గానీ పైన తెలిపిన కోర్టునందు హాజరై పై కేసు నందు మీ ఇరువురికి మీకు గల ఆక్షేపణలు వున్న యెడల పైన తెలిపిన తేదీన పై కోర్టునందు హాజరై తెలుపుకొనగలరు. లేనిచో మీ ఇరువురికి ఎటువంటి ఆక్షేపనలు లేవని శ్రీ కోర్టువారు భావించి మీ పరోక్షంగా పైన తెలిపిన కేసును తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం)
సిహెచ్.రవికుమార్, అడ్వకేట్,
డోర్ నెం. 48-16-34, కామినేని నగర్,
బల్లెంవారివీధి, విజయవాడ - 520007.
సెల్ : 9441266502.

మొదటిపేజీ తరువాయి

స్మార్ట్ 'షాక్'

రూ.30 వేల ఖర్చు వినియోగదారులపై పడుతుంది. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఖరీదు మొత్తాన్ని 96 నెలల వ్యవధిలో విద్యుత్ ఛార్జీలతో పాటు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికిప్పుడు చెల్లించాలంటే ఎక్కడ వినియోగదారుల నుంచి వ్యతిరేకత వస్తోందోనని, వీటిని తిప్పి కొట్టడం ప్రారంభమైతే అసలుకే మోసం వస్తుందన్న ఉద్దేశంతో దశలవారీగా వీటిని ఏర్పాటు చేస్తూ ప్రతి నెలా ఇఎంఐలాగా చెల్లించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మొత్తం ఇప్పుడు చెల్లించాల్సిన పని లేదని విద్యుత్ శాఖాధికారులు మాయమాటలు చెబుతూ వస్తున్నారు. నగరంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేయాలని విద్యుత్ అధికారుల లక్ష్యంగా పెట్టుకున్నారను. ఇవే కనుక అమలులోకి వస్తే...విద్యుత్ మీటర్ల భారం ఒక ఎత్తయితే, వినియోగించుకునే విద్యుత్‌కయ్యే వ్యయాన్ని ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. పీక్ అవర్స్ ఆధారంగా విద్యుత్ యూనిట్లకు ఛార్జీలు కూడా మారిపోతాయి. ప్రజలు వినియోగిస్తున్న సెల్‌ఫోన్లకు ముందుగా బ్యాలెన్స్ వేయించుకున్నట్లుగానే స్మార్ట్ మీటర్ల వ్యవస్థకు కూడా ముందుగానే డబ్బులు చెల్లించాలి. అంతేగాక భవిష్యత్తులో పేదలకు, రైతులకు విద్యుత్ సబ్సిడీ అనే మాటే ఉండదు. దళిత, గిరిజనకు ఉచిత విద్యుత్ ఊసే ఉండదు. ప్రతి యూనిట్‌కు గృహ వినియోగదారులు ఇప్పుడు చెల్లిస్తున్న దానికన్నా ఐదారు రెట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కాంప్లెక్స్‌లు, చిన్న పరిశ్రమలకు స్మార్ట్ మీటర్ల భారం భారీగా పడనుంది. ఒకవేళ విద్యుత్ బిల్లులు చెల్లించలేక పరిశ్రమలను మూతేసుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లను వినియోగదారులతో కలిసి సిపిఎం పలుచోట్ల అడ్డుకుంటోంది. ప్రమాదకర స్మార్ట్ మీటర్ల వ్యవస్థను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రజలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరిస్తోంది.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

నగరంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వినియోగదారులు అడ్డుకున్నారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మీటర్లు బిగిస్తున్నారని తెలుసుకున్న ప్రజలు వాటిని అడ్డుకున్నారు. విజయవాడ గాంధీనగర్ రాజ్, యువరాజ్ థియేటర్ సమీపంలోని దత్త కాంప్లెక్స్‌లో వినియోగదారులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా... అధికారులతో కలిసి అదానీ కంపెనీ సిబ్బంది మంగళవారం విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ప్రారంభించారు. స్థానికుల నుండి సమాచారం తెలుసుకున్న వెంటనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి మీటర్ల బిగింపును అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విజయవాడ పశ్చిమ, సెంట్రల్ సిటీ కార్యదర్శులు బోయి సత్యబాబు, బి.రమణరావు, నాయకులు సిహెచ్.శ్రీనివాస్, పి.కష్ణమూర్తి, వి.గురుమూర్తి, నాగేశ్వరరావు, రవీంద్ర, పీర్ సాహెబ్, కోరాడ రమణ, బి.లక్ష్మణరావు, ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు !

ఎన్నికల్లో వసంత గెలిచారని, 2027లో సర్దుకొని తిరిగి ప్రయాణం అవుతారని విమర్శించారు. ఈ రెండు వేదికల్లో వసంత వర్సెస్ జోగి రమేష్ విమర, ప్రతి విమర్శల్లో వారి అవినీతి వ్యవహారాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో సాగాయి. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి అభివద్ధి చేస్తారనుకుంటే నేతలు చేసే పని ఇదే అని ముక్కున వేలేసుకుంటున్నారు నియోజకవర్గ ప్రజలు. గత ఐదేళ్ల నుండి నుండి మైలవరం రాజకీయాలు పరిశీలిస్తే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎప్పుడు వసంతను విమర్శించినా నియోజకవర్గంలో బూడిద గ్రావెల్ తన బావమరిదితో కలిసి దోచుకుంటున్నారని, ఆయన మైలవరం వీరప్పన్ అని నిత్యం విమర్శలు చేస్తూ ఉండేవారు. 2019లో వైసిపి ఎంఎల్‌ఎగా గెలుపొందిన వసంత...2024 ఎన్నికల్లో టిడిపిలో చేరి మళ్లీ ఎంఎల్‌ఎగా విజయం సాధించారు. అప్పటివరకు రాజకీయ బద్ధ శత్రువులుగా ఉన్న వసంత, దేవినేని తమ వైరాన్ని పక్కనపెట్టి ఒకే వేదికపై అభివాదం చేసి రెండు పార్టీల కార్యకర్తలు అవాక్కయ్యేలా చేశారు. మైలవరం నియోజకవర్గాన్ని అభివద్ధి బాటలో నడపాలంటే కష్ణ ప్రసాద్ లాంటి నాయకుడు కావాలని జోగి రమేష్ చెప్పి 2019లో తాను ఇన్చార్జిగా ఉన్న మైలవరం నియోజకవర్గం నుండి ఆయనకు అవకాశం ఇచ్చారు. జోగి పెడన నుండి పోటీ చేసి గెలుపొందారు. మంత్రి కూడా అయ్యారు. ఇప్పుడు అదే జోగి రమేష్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సహజ వనరులన్నీ దోచేశారని వసంతపై ఆరోపణలు గుప్పించడం, జోగిపై కష్ణ ప్రసాద్ విమర్శలు చేయడం చూస్తే పై సామెత గుర్తుకు వస్తుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

In The Court Of The Principal Civil Judge (Junior Division) Tanuku
O.S.No. 85/2024

Plaintiff: State Bank Of India, Velpur Branch, Represented by its Branch Manager.
Defendant: Peddiraju Lakshmi Aparna

Defendant: Peddiraju Lakshmi Aparna, D/o. Chandra Sekhar, D.No.116/6. Old LIG, H.B.Colony, Bhavani Puram, Vijayawada, Krishna District.

పై నెంబరు దావాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వేల్పూరు వారు ప్రతివాది తాలూకు నిల్చియున్న బాకీ మరియూ వడ్డీ రూ.2,26,946-00 మరియూ దావా ఖర్చులు రాబట్టుకొనే నిమిత్తం కోర్టులో దావా దాఖలు చేయగా ప్రతివాది అయిన పెద్దిరాజు లక్ష్మీ అపర్ణ దావా సమన్లు తీసుకొనకుండా Evade చేయుచున్నందున ఈ పబ్లికేషన్ తేదీ లగాయితు నెలరోజులలోగా పై కోర్టు వారి ఎదుట హాజరై వకల్తా దాఖలు చేయించని ఎడల పరోక్షమందు తీర్మానించబడును.

D.RAVI KUMAR
Advocate, Tanuku
Cell: 9885012183
Tanuku,
06-11-24.

మహారాజశ్రీ విజయవాడ సివిల్‌జడ్జి
(7వ అదనపు జిల్లా డివిజన్)
ఓ.యస్. నెం. 155/2016

బిట్వీన్ :
నల్లమోతు మధుబాబు ....వాది
మరియు
నల్లమోతు కనకదుర్గ (డైడ్) మరియు ఇతరులు
..... ప్రతివాదులు
టు,
నల్లమోతు ఉషారాణి, తండ్రి : లేట్ వెంకటేశ్వరరావు, నివాసం : 56-3-6, రామినేని వారి వీధి, పటమట, విజయవాడ.
జె.సుస్మిత, తండ్రి శ్రీనివాసరావు, ప్లాట్ నెం. SF2, కె.పి.ఆర్. టవర్స్, సాయిబాబా టెంపుల్ రోడ్డు, ప్రసాదంపాడు, విజయవాడ.
.... ప్రతివాదులు 2 మరియు 3

పై నెంబరు దావా నందు మూడవ ప్రతివాదిని చేర్చిన తర్వాత ప్లెయింటు అమెండ్‌మెంట్ నీట్ కాపీని దాఖలు చేయటమైనది. తదుపరి ప్లెయింటు అమెండ్‌మెంట్ నీట్ కాపీ దాఖలు చేసిన తరువాత దావానందలి విషయాలు తెలియగలందులకు ప్రతివాదులైన 2, 3 వారలకు సూట్ సమన్స్‌నకు కోర్టువారు ది. 25-11-2024నకు వాయిదా వేసియున్నారు. కావున పైన పేర్కొన్న దావా నందలి 2, 3 ప్రతివాదులు ది. 25-11-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరయి తమ ఆక్షేపణలు తెలుపగలరు. లేనియెడల వాని పరోక్షమున తీర్మానించ బడునని తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వులతో)
ఇట్లు
కె.జోగేశ్వరరావు,
అడ్వకేట్, విజయవాడ.
సెల్ : 9393434471.

గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించండి

ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కార్యదర్శి సమరం

పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ మండలంలో ఉన్న మోటూరు గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎస్.సమరం కోరారు. మంగళవారం మోటూరులో ఉన్న గురుకుల పాఠశాలను సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ సుమారు 679 మంది విద్యార్థినిలు ఉన్నచోట కనీస వసతులు లేకుండా సమస్యలను కప్పిపుచ్చి తల్లిదండ్రులకు విద్యార్థినిలు చెప్పేంతవరకు గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలు బయటకు రాలేదు అంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో గురుకుల పాఠశాల విసిట్ ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారో అర్థమవుతుందన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు 50 ఉన్నా ఉపయోగంలో 10 నుంచి 15 మాత్రమే ఉన్నాయని, వాటిని వెంటనే వినియోగంలోకి తేవాలని అన్నారు. పాఠశాలను సందర్శించడానికి వచ్చిన గుడివాడ తాసిల్దార్ వి.రామ కోటేశ్వరరావు, ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్‌కి విద్యార్థుల సమస్యల్ని వివరించడం జరిగిందన్నారు. అదేవిధంగా క్లాస్ రూమ్ స్లాబు పెచ్చులు ఊడి పడిపోవడంతో భయాందోళనలో విద్యార్థినిలు తరగతులను వినడం జరుగుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఉమ్మడి కృష్ణాజిల్లా డిపివో కె.హేమలతని కలిసి గురుకుల పాఠశాల సమస్యలను తెలియజేశామన్నారు. పాఠశాలలో ఉన్న కెమిస్ట్రీ ల్యాబ్, ఫిజికల్ ల్యాబ్ చెత్తాచెదరంతో సిమెంట్ బస్తాలతో ల్యాబ్‌ని ఉపయోగించలేని విధంగా ఉండటంపై డిపిఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, ఐద్వా నాయకురాలు రజిని, ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా ఉపాధ్యక్షులు సలీం, ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల కార్యదర్శి సమీర్, అధ్యక్షులు నాగేంద్ర పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

బాలల దినోత్సవం సందర్భ:గా మండలంలోని ఉన్నత పాఠశాల బాలబాలికలకు వి క్యూబ్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ సంస్థ వారి సహకారంతో మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం అంగలూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించార. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ లక్ష్మినారాయణ, వినయ్ కుమార్ ఎంఈఓలు జి.జగన్‌మోహన్ రావు, జి గోపాల్‌రావు పాల్గొన్నారు. వి క్యూబ్ ఫౌండర్ నిర్వాహకులు పామర్తి వీర రాఘవులు, మోదుగుమూడి అంకలరావు వారి సహాయంతో బాలికలకు కబడ్డీ, ఖోఖో నిర్వహించారు.

న్యుమోనియా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉయ్యూరు: లయన్స్ క్లబ్, ప్రజ్ఞచెస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం న్యుమోనియా వ్యాధి నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు. కాటూరురోడ్డు ప్రజ్ఞా హాస్పిటల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఊపిరితిత్తులు, శ్వాసకు సంబంధించిన దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించి వైద్య సేవలందించారు. క్లబ్ 316డి జోన్-1 చైర్పర్సన్ ఎండి ఇస్మాయిల్ ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబరు 16న న్యుమోనియా దినోత్సవం నిర్వహిస్తారని, లయన్స్ క్లబ్ తరచు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలతో పాటు వైద్య సహాయం కోసం సంప్రదించిన పేదలకు క్లబ్‌తో కలిసి సేవలందించేందుకు ముందుకువచ్చిన హాస్పిటళ్లకు గౌరవ పూర్వక సిఫార్సుతో ప్రత్యేక సందర్భాలలో నిపుణుల ఉచిత వైద్యసేవలు అవసరమైన వారికి అందిస్తున్నామన్నారు. డాక్టర్ కె.కృపాసాగర్ వైద్యసేవలందించగా, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, కార్యదర్శి రాంబాబు, ప్రతినిధులు నల్లా శ్రీనివాసరావు, హాసన్ అహ్మద్ తదితరులు పాల్గొని సేవలందించారు.

మార్కెట్ యార్డుకు కమిటీని నియమించాలి : గౌతమ్

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నీ ఎప్పుడు నియమిస్తారు అంటూ వైసీపీ అభిమాని యువ న్యాయవాది బడే గౌతమ్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హయాంలో ఎస్సీలకు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించి షెడ్యూల్డ్ కులాలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు.

అప్పట్లో ఎస్సీలకు కేటాయించిన చైర్మన్ పదవిని వెంటనే భర్తీ చేయాలని ఇప్పటి అధికార పార్టీకి చెందిన పార్టీ వారు కొందరు సోషల్ మీడియా వేదికగా గగ్గోలు పెట్టడం జరిగిందన్నారు. కానీ నేటి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్న ది వి వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం చేయకపోవడంపై గతంలో గగ్గోలు పెట్టిన పార్టీ నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు అంటూ ప్రశ్నించారు. షెడ్యూల్ కులాల పట్ల వారికి ప్రేమ ఉందని చెప్పుకుంటున్న పెద్దలు కమిటీ చైర్మన్ పదవిని మరల ఎస్సీలకు కేటాయించి నియామకం చేసి ఎస్సీల పట్ల వారు చెప్పుకుంటున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని గౌతమ్ డిమాండ్ చేశారు.

టిడిపి నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం టిడిపి నేతలపై పెట్టిన కేసును మంగళవారం గన్నవరం కోర్టు కొట్టేసింది. 2021లో అప్పటి గన్నవరం శాసనసభ్యుడు వల్లభనేని వంశీ టిడిపి జాతీయ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సతీమణి భువనేశ్వరిపై చేసిన వివాదాస్పద అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తెదేపా శ్రేణులు శాంతియుత నిరసన తెలుపగా పోలీసులు అప్పడు కేసు నమోదు చేశారు. వైకాపా ప్రభుత్వ ఒత్తిడితో ఎఫ్.ఐ.ఆర్ నెం 498/2021లో 341,188 సెక్షన్ల కింద ట్రాఫిక్ కు అంతరాయం కలిగించారని, జాతీయ రహదారి పై అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని గన్నవరం మండల తెదేపా అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మండల అధ్యక్షుడు ఆరుమళ్ల కృష్ణారెడ్డి,రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా,జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు మండవ అన్వేష్,జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నిమ్మకూరు మధు, బోడపాటి రవి,మేడిపల్లి రమ,షేక్ అబుల్యాజ్, చిక్కవరపు నాగమణిను నిందితులుగా చేర్చారు. కేసులు విచారణ అనంతరం గన్నవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

ఇమామ్‌కు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి ప్రైవేట్ పాఠశాలలు ఎంతో దోహదం చేస్తున్నాయని మదర్ థెరిసా హైస్కూల్ అధినేత హరిప్రసాద్ అన్నారు. మంగళవారం ముస్తాబాద్‌లోని నవ భారత్ హైస్కూల్ నందు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కరస్పాండెంట్ షేక్ ఇమామ్‌ను సత్కరించారు. గత కొన్ని ఏళ్లుగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఇమామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు దేవినేని కిషోర్ కుమార్, గవర్నింగ్ బాడీ కన్వీనర్ గోన సాంబశివరావు, విద్యావేత్త గాంధీ త్రివేణి, విద్యా సంస్థల డైరెక్టర్ అవుతు అజయ్‌కుమార్, అసోసియేషన్ కార్యదర్శి హరినాథ్, కోశాధికారి ఈశ్వరరావు మరియు ప్రోగ్రాం కమిటీ చైర్మన్ గుండె స్లేవా తదితరులు పాల్గొన్నారు.

సిటీ బస్సులు నడపండి

ప్రజాశక్తి-కంకిపాడు: సిద్ధార్థ ఫ్లైఓవర్‌పై ఆర్‌టిసి బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కంకిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్‌బాబు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్, కానూరు, పటమట, ఆర్టిసి కాలనీ, గురునానక్ కాలనీ వంటి ప్రాంతాల మీదుగా బందరు రోడ్డుకు సమాంతరంగా ఉన్న పంట కాలువ రోడ్డుకు ఇరువైపులా ఎన్నో విద్యా సంస్థలు, ఆసుపత్రులు, రోజువారి కార్మికులు మొదలు ఎందరికో ఉపాధి కల్పిస్తున్న జవహర్ ఆటోనగర్ వంటివి ఉన్నాయని, ఈ క్రమంలో ఉయ్యూరు, కంకిపాడు నుండి బెంజ్ సర్కిల్ వరకు సిద్ధార్థ ఫ్లై ఓవర్, పంట కాలువ రోడ్డు మీదుగా ఆర్టిసి సిటి బస్సులు నడిచేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ పోటీలకు భువనేశ్వర్ ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ: జాతీయస్థాయి కబడ్డీ అండర్ 14 విభాగం జూనియర్ స్థాయి కబడ్డీ పోటీలకు పులిగడ్డ గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి పి భువనేశ్వర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. మంగళవారం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ విద్యార్థిని అభినందిస్తూ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9, 10, 11 తేదీలలో గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో భువనేశ్వర్ అత్యంత ప్రతిభ కనబరిచినందుకు జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు.

'ప్రజా పోరు' కరపత్రాలు పంపిణీ

గన్నవరంలో...

ప్రజాశక్తి-గన్నవరం: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఇసుక అందుబాటులోకి తేవాలని, కరెంటు భారాన్ని తగ్గించాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన గన్నవరం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. గాంధీ బొమ్మ సెంటర్, ఆగిరిపల్లి రోడ్డు, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, జాతీయ రహదారిపై కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ నెల రోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంట నూనెల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇసుక ధరలు పెరగడం, కరెంటు భారాలు వేయడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. మద్యం బెల్ట్ షాపులు అదుపు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరగాని సాంబశివరావు, ఏసుదాసు, తాతబ్బాయి, మిరప నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **ఉంగుటూరు:** మండలంలోని తేలప్రోలు గ్రామంలో కరపత్రాల పంపిణీ ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 న మండల కేంద్రం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాగంటి సాంబశివరావు, భీమవరపు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** గుడివాడ పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాపోరు వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిషారానికి ప్రజాపోరు కార్యక్రమంలో ప్రతి ఇంటింటా ప్రజాయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రేపానికొండ, పి రజిని, ఎల్ సురేంద్ర, సమీర్ తదితరులు పాల్గొన్నారు. **పెనమలూరు:** పెనమలూరులో సిపిఎం ప్రజాపోరు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 14న మండల కేంద్రం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు కోరారు.

గుడివాడలో...

ఉంగుటూరులో...

పెనమలూరులో...

దుర్గమ్మను దర్శించుకున్న హీరో వరుణ్ తేజ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ప్రముఖ హీరో వరుణ్ తేజ్ బృందం మంగళవారం దర్శనారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వీరికి ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి, అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటం అందజేశారు.

అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న రోజుల్లో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు కొనసాగిస్తామని కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వర రావు అన్నారు. అజిత్‌సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణి పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళే నాగేశ్వరరావు మాటాడారు. ట్రస్ట్ డైరెక్టర్ కళ్ళే సీతా మహాలక్ష్మి, జయదుర్గా, మేఘవాణి, ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న వస్తువులు, నగదు అప్పగింత

ప్రజాశక్తి - భవానీపురం : రైల్వే విశ్రాంత ఉద్యోగి పోగొట్టుకున్న పర్సును తిరిగి ఆయనకు అప్ప గించిన కానిస్టేబుల్ చందు తన నిజా యితీని చాటుకు న్నారు. కాని స్టేబుల్ వల్లభాపురం చందు (పిసి నెంబర్ 346) అజిత్ సింగ్ నగర్‌లో పనిచేస్తున్నారు. మధ్యాహ్నం విధులకు వెళ్తున్న చందుకి పర్సు దొరికింది. అందులో రూ.16,500 నగదు, ఆధార్ కార్డు, పాన్ కార్డుతో పాటు హెల్త్ డాక్యుమెంట్లు ఉన్నాయి. వెంటనే కానిస్టేబుల్ చందు కంట్రోల్ రూంకి కాల్‌చేసి ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. సదరు బాధితుడికి ఫోన్ చేసి వివరాలు తెలిపారు. పర్సు పోగొట్టుకున్న బాధితుడు పెండ్యాల సత్యనారాయణ రైల్వే విశ్రాంతి ఉద్యోగి. ఆయనకు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ప్రకాష్ సమక్షంలో పర్సుని భద్రంగా పెండ్యాల సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రకాష్‌తో పాటు భవానీపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది కానిస్టేబుల్ చందూని అభినందించారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాము

ప్రజాశక్తి- నందిగామ :
ఎపి ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నందిగామ చెందిన టిడిపి పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము నియమితులయ్యారు. ఏచూరి రాము నియామకం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఏచూరి రామును నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య అభినందించారు.

విస్తృతంగా ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : అడ్డు అదుపు లేకుండా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ట్రూ ఆఫ్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని తదితర ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం తిరువూరు మండలం వామకుంట్ల గ్రామంలో మంగళవారం జరిగింది. కరపత్రాలను పంపిణీ చేసి ఈనెల 14న తిరువూరు తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇసుకల వెంకటేశ్వర్లు, వేల్పుల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ : సిపిఎం 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల్లోనే ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఇప్పటికే సింగ్‌నగర్ ప్రజానీకం వరదల్లో సర్వం నష్టపోయారనని ఇప్పుడు కరెంటు ఛార్జీల పేరుతో ప్రజలపై వేలకోట్లు భారం వేయడం కరెక్ట్ కాదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలు ఉపసంహరించు కోవాలని 14న సిపిఎం ప్రజాపోరు ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ కార్యదర్శులు. ఎస్ కె నిజాముద్దీన్ వి సాంబశివరావు, స్థానిక నాయకులు యం వి రమణ. సుగుణ.ఆదామి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ అర్బన్ : సిపిఎం తూర్పునగర కమిటీ ఆధ్వర్యంలో రామలింగేశ్వర్ నగర్, గాంధీ కాలనీ నివాస ప్రాంతంలో ప్రజాపోరులో భాగంగా స్థానిక సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు సిటీ నాయకులు యన్.నాగేశ్వరరావు, జి.కె.ప్రసాద్, మహిళా నాయకులు టి.శాంతి, షేక్.ఆశా తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో...

విజయవాడ 58వ డివిజన్‌లో

తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో...

తండ్రికి బాలుడి అప్పగింత

ప్రజాశక్తి - తిరువూరు :
అదృశ్యమైన తిరువూరు బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి పాపగంటి రాజశేఖర్‌ను పోలీసులు ప్రిన్సిపల్ సమక్షంలో తండ్రికి అప్పగించారు. సోమవారం ఉదయం స్కూల్ గోడ దూకి పారిపోయిన రాజశేఖర్ గంపలగూడెం మండలం తోటమూలలో ఒక హోటల్ వద్ద అదేరోజు రాత్రి కనిపించడంతో గంపలగూడెం పోలీసులు అతన్ని తిరువూరు ఎస్ఐకి అప్పగించారు. ఎస్ఐ సత్యనారాయణ తిరువూరు పోలీస్ స్టేషన్ల ప్రిన్సిపల్ సమక్షంలో తండ్రికి అప్పగించారు. తప్పిపోయిన బాలుడిని 24 గంటల్లో గుర్తించి వారికి అప్పగించిన పోలీసులకు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

గిరిజనుల పక్షపాతి చంద్రబాబు: రమేష్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కూటమి ప్రభుత్వం గిరిజనులకు రూ.7.557 కోట్ల బడ్జెట్ కేటాయించి గిరిజనుల పక్షపాతిగా నిలిచిందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బాణావతు రమేష్ అన్నారు. మంగళవారం రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం చంద్రబాబు నిజమైన గిరిజనుల పక్షపాతి అని గత వైసిపి ప్రభుత్వం లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ఊసే లేదని, గిరిజన ప్రాంతంలో రోడ్డు లేక గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో డోలు కట్టుకొని, కొండలు, గుట్టలు దాటాల్సి వచ్చిందని తెలిపారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిపుత్రులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు.

మాట్లాడుతున్న దోనేపూడి శంకర్

ఎన్నికల హామీలు తుంగలో తొక్కిన కూటమి : సిపిఐ

ప్రజాశక్తి - తిరువూరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం తుంగలో తొక్కిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి మావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో సూపర్ సిక్స్ హామీలకు ఎటువంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని కోరుతూ ఈ నెల 18న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద అర్జీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని శంకర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్య దర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి నాగుల్ మీరా, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ నిరుత్సాహపరిచింది

వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరుత్సాహ పరిచిందని వైసిపి సెంట్రల్ నియోజక వర్గ సమన్వయకర్త, మాజీ ఎంఎల్ఎ మల్లాది విష్ణు అన్నారు. అరకొర నిధులు, అంకెల గారడీతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగిం చిందన్నారు. రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా ఏ రంగానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపోయిందన్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువతకు ఈ బడ్జెట్ తో ఒరిగేదేమీ లేదన్నారు. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, రైతు సంక్షేమానికి సరిపడా ఎక్కడా కేటాయింపులు లేవని.. సూపర్ సిక్స్ పథకాల ఊసే కానరాలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విజయవాడ నగరానికి మొండిచేయి చూపారని విష్ణు ఆరోపించారు. గుణదల ఫ్లైఓవర్, బుడమేరు ఆధునీకరణ, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టవలసిన రహదారులు, డ్రెయిన్లు, ఇతర మరమ్మతులకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. మొత్తానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసగించిందని మసిపూసి మారేడు కాయలాగా బడ్జెట్ ఉందని మల్లాది విష్ణు అభిప్రాయపడ్డారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజక వర్గంలోని 43వ డివిజన్లలో మంగళవారం టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో డివిజన్ అధ్యక్షులు కునికి కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 43వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు కునికి కొండయ్య మాట్లాడుతూ తమ డివిజన్లో ఇప్పటివరకు సుమారు వెయ్యికి పైగా టిడిపి సభ్యత్వాలను నమోదు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి డివిజన్ ఉపాధ్యక్షులు డబ్బుగొట్టు ఏడుకొండలు, నాయకులు మాదాల తిరుపతిరావు యాదవ్, ఎం. రాంబాబు, పూజల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు (టైలర్), పెన్నా ఈశ్వరమ్మ, మాగం ఆత్మారాం, టిడిపి రాష్ట్ర కార్యాలయ బాధ్యులు నవీన్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

విజయవాడ : 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను మంగళవారం సెంట్రల్ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. గవర్నరుపేట ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్య క్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉత్తమ అధ్యాపకులకు అభినందన

ఉత్తమ అధ్యాపకులను అభినందిస్తున్న ఉపకులపతి కె గంగాధరరావు తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న అందజేసిన రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల జాబితాలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆరుగురు అధ్యాపకులు అవార్డులు పొందడం సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు అన్నారు. మంగళవారం వర్సిటీలో ఆరుగురు అవార్డు గ్రహీతలను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకేసారి ఆరుగురు అధ్యాపకులు ఆచార్య యం. త్రిమూర్తి రావు, ఆచార్య వై. అశోక్ కుమార్, ఆచార్య ఎన్. వి. కృష్ణారావు, ఆచార్య డి.రామచంద్రన్, డాక్టర్ పి. బ్రహ్మాజీరావు, డాక్టర్ పి పూర్ణచంద్రరావు లకు అవార్డులు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. బోధన, పరిశోధన రంగాలలో మీరు చేస్తున్న కృషికి ఇది నిదర్శనం అన్నారు. ఇటువంటి అవార్డులు బాధ్యతలను పెంచుతాయని పేర్కొన్నారు. పరిపాలన రంగంలో కూడా మీరు అందిస్తున్న సేవలకు అభినందనలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులతో వర్సిటీ ఖ్యాతిని పెంచాలని కోరారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య కే. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓ ఎస్ డి ఆచార్య ఆర్ వి ఎస్ ఎస్ ఎన్ .రవికుమార్, సి డి సి డిన్ ఆచార్య వీ. రవికుమార్ ,పిజి పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం .సుబ్బారావు, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి, కెమిస్ట్రీ విభాగం సీనియర్ ఆచార్యులు ఆచార్య ఆర్. రమేష్ రాజు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ త్రిమూర్తిరావు సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయుడిగా మహాత్మ జ్యోతిరావు పూలే చైర్ అధ్యాపకుడు ఆచార్య త్రిమూర్తి రావు చంద్రబాబు చేతుల మీదుగా సోమవారం నాడు అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన త్రిమూర్తిరావును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల బీసీ విద్యార్థి సంఘ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐపీఎస్ షరిన్ బేగం, బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోటి యాదవ్, రామకృష్ణ, మహేష్, కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మెగా డిఎస్సి 2024 రిక్రూట్ మెంట్ పరీక్షలకు హాజరయ్యే బిసి, ఎస్సి, ఎస్టి కులాలకు చెందిన అభ్యర్థులకు కష్ణాజిల్లాలోని ఎపి స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అర్హత కల్గిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 15 తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు సాధికారిత అధికారి జి.రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9849420123, 9441309317లకు సంప్రదించాలన్నారు.

19న బహిరంగ వేలం

ప్రజాశక్తి-గన్నవరం: ఏపి ఎస్‌బిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిడమానూరు లోని ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలాన్ని కృష్ణాజిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, నిడమానూరు డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఐఎంఎఫ్ఎల్ డిపో నిడమానూరులో జరుగుతుందన్నారు. ఈ వేలంలో 60 ఫ్రీజర్స్, 61 బ్యాటరీ ఇన్వర్టర్స్, 79 క్యాష్ చెస్, 182 స్కానర్లు, 77 క్యాష్ కౌంటింగ్ మెషీన్స్ వేలం వేస్తామన్నారు. ఇతర వివరాలకు 9000476476, 9177117734 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విద్యా ప్రమాణాలు పెంచండి

డిఇఒ రామారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింత పెంచేందుకు ఉప విద్యాశాఖ, ప్రధానోపాధ్యాయులు మరింత కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.విజె.రామారావు సూచించారు. మంగళవారం మచిలీపట్నం డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, కాబట్టి ప్రభుత్వం విద్య వ్యవస్థలో ప్రవేశ పెట్టే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఎప్పుడు ఏ సందేహం వచ్చిన నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కష్ణాజిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామారావును ఈ సందర్భంగా మచిలీపట్నం డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి శేఖర్ సింగ్ ఆధ్వర్యంలో మచిలీపట్నం డివిజన్ ప్రధానోపాధ్యాయ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షులు ఏవి రమణ ప్రధాన కార్యదర్శి కేబిఎన్ శర్మ, డిసిఇబి సెక్రెటరీ జాన్‌సాహెబ్, ఘంటసాల ఎంఈఓ 2 మోమిన్, బంటుమిల్లి ప్రధానోపాధ్యాయులు వెంకట రావు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ డిఎస్ఓ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

గోవుల అందాల పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: పశువుల సంత గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామివారి ఆలయంలో గోవుల అందాల పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు రోజ్ మిల్క్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు, పొట్లూరి రవి, పోలవరపు వెంకటరావు, ఈడుపుగంటి ఉమామహేశ్వరరావు, వైపిసి ప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు: కిషోర వికాసం, పిల్లల దత్తత కార్యక్రమం అవగాహనతో నిర్వహించాలని జిల్లా ప్రొటెక్షన్ (దత్తత) అధికారి వి.ప్రశాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గన్నవరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పెద్దఆవుటపల్లి సూపర్వైజర్ పద్మాదేవి అధ్యక్షతన కిషోర వికాసం, పిల్లల దత్తతపై జరిగిన అవగాహన సదస్సులో ప్రశాంత్ మాట్లాడుతూ కషోర బాలికలు బాల్యవివాహాలు, బాలికల అక్రమ తరలింపు, బాలకార్మికులు, బాలల బిక్షాటన లాంటివి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు అని వీటిని గమనిస్తూ అర్థం చేసుకుని ఇలాంటి ఘటనలు తమ దృష్టికి తీసుకు రావాలని, 1098 హెల్ప్ లైన్ నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా బాధితులను సాయం చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ ప్రేమలత, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారిణి సత్య, పాఠశాల హెచ్ ఎం కెవివికె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'బిసిలకు అధిక ప్రాధాన్యత'

ప్రజాశక్తి-నాగాయలంక

వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.39,007 కోట్లు నిధులు కేటాయించడం పట్ల బీసీ నేత ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీల కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా వాటిని ఉత్సవ కమిటీలుగా మిగిల్చిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించడమే కాకుండా ఏబీసీడీఈ గ్రూపుల వారీగా కార్పొరేషన్లకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. బీసీల ఆర్థిక అభ్యున్నతికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

గ్రావెల్ లారీలు పట్టివేత

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలం పెరికిడు హైవే వద్ద మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు అక్రమంగా సాగిస్తున్న గ్రావెల్ తవ్వకాలపై సోమవారం రాత్రి రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి దాడి చేశారు. ముందస్తు సమాచారంతో లారీలను అదుపులోకి తీసుకున్నట్లు ఎమ్మార్వో తెలిపారు. రెండు లారీలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-చల్లపల్లి: పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేసి చిన్నారుల, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. సాధారణ తనిఖీలలో భాగంగా చల్లపల్లి పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలను మంగళవారం సందర్శించారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్ నందు అమలు పరచాలని సూచించారు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్స్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్, చల్లపల్లి సిఐ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం): రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిచేయాలని సిపిఎం నాయకులు బర్రె లెనిన్ బాబు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కారానికి గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో సిపిఎం పార్టీ నాయకుడు బర్రె లెనిన్ మాట్లాడుతు రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలతో రైతుల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భూమి రికార్డుల్లో కూడా అనేక తప్పులు జరిగాయని, వాటిని సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో రామాంజనేయులు, గ్రామ సర్వేర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



పాపారావుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి: ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావును పలువురు శుభాకాంక్షలు తెలిపారు. చల్లపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, జనసైనికులు గంగిశెట్టి బాబురాజేంద్ర, చిరంజీవి యువత జిల్లా జాయింట్ సెక్రటరీ మడమల రంజిత్ కుమార్, యువనాయకుడు ఆకుల పవన్‌కుమార్, సీనియర్ నాయకుడు నెరుసు కృష్ణాంజనేయులు విజయవాడలో పాపారావును కలిసి అభినందనలు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైలవరం : టిప్పర్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా మైలవరం మండలం వెల్వడం అడ్డరోడ్డు వద్ద మంగళవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం వెల్వడం గ్రామానికి చెందిన పత్తిపాటి నాగరాజు (54) అడ్డరోడ్డు వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం మొక్కజొన్న విత్తనాలు నాటేందుకు కూలీలను తీసుకొని పొలం వద్ద దించి ఇంటికి తిరిగి వస్తుండగా నూజివీడు వైపు నుండి మైలవరం వస్తున్న టిప్పర్ ముందు ఉన్న నాగరాజు వాహనాన్ని ఢీకొంది. దీంతో రహదారిపై పడిన నాగరాజు పైనుండి టిప్పర్ వెళ్లడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్.కె.సుధాకర్ ప్రమాదానికి కారణాలను తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అడ్డరోడ్డు వద్ద రహదారి గుంతల మయంగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల ఆ గోతిలో ఆటోలు పడటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇకనైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి గుంతల మయంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మృతి చెందిన నాగరాజు

ఆన్‌లైన్ మోసంపై కేసు

ప్రజాశక్తి - కంచికచర్ల : సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ మోసానికి గురై లక్షలాది రూపాయలు పోగొట్టుకున్న సంఘటన కంచికచర్లలో జరిగింది. కంచికచర్ల గ్రామానికి చెందిన పోలిశెట్టి సాంబశివరావు బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా సుమారు 20 రోజుల క్రితం తన తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. తన వాట్సాప్ నంబర్‌కు వర్కెక్స్ జనరేషన్ డిజిటల్ కంపెనీ, సిక్స్ స్పేస్ ఎక్సేంజ్ అని చెప్పి ఆన్లైన్ టాస్క్ చేస్తే డబ్బులు వస్తాయని మెసేజ్ వచ్చిందని ఆ మెసేజ్‌కు స్పందించడంతో తన ఖాతాలోని రూ.6 లక్షలు పోయాయని తెలిపాడు. తాను మోసపోయినట్లు గుర్తించి కంచికచర్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాధితునికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. రెడ్డిగూడెం మండలం పరిధిలోని ఆరుగురు పాత ముద్దాయిలను రెడ్డిగూడెం తహశీల్దారు సుశీలదేవి ఎదుట హాజరుపరిచి బైండ్ ఓవర్ చేశారు. దాడుల్లో మైలవరం ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ ఎం.దుర్గా ప్రసాదరావు, హెచ్‌సిలు కుమార స్వామి నాగరాణి కానిస్టేబుల్స్ రమేష్ సాయి, కృష్ణ సర్వేష్, చెన్నకేశవులు, రాజకుమార్ పాల్గొన్నారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

తహశీల్దార్ ఎదుట హాజరైన ముద్దాయిలు

వ్యక్తి సజీవ దహనం

ప్రజాశక్తి - తిరువూరు : పూరిల్లు దగ్ధమై వ్యక్తి సజీవ దహనమైన ఘటన తిరువూరు మండలం లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామంలోని దళిత పేటకు చెందిన బాలమర్తి ఇస్సాక్ (52) ఇటీవల కొత్తగా బిల్డింగ్ నిర్మించుకున్నాడు. అప్పటి వరకు అక్కడే ఉన్న పూరింటిలో ఉన్నాడు. కుటుంబ సభ్యులు కొత్త ఇంటిలో నిద్రిస్తుండగా ఇస్సాక్ మాత్రం పూరింటిలో నిద్రిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో బయటకు రాలేక ఆ మంటల్లోనే సజీవ దహనం అయ్యాడు. ఎస్ఐ సత్య నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - మైలవరం : పేద, మధ్యతరగతి మహిళల ఆర్థిక అభివృద్ధికి ఉచితంగా ఇస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ అనురాధ పేర్కొన్నారు. మోస్ట్ చారిటబుల్ ట్రస్ట్, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నూజివీడు రోడ్‌లోని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు నైపుణ్యం, ఉపాధి కల్పనలకు అవకాశం ఉంటుందని తద్వారా స్వశక్తితో ఎదగవచ్చు అన్నారు. మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయసుధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఒ బాలు, మోస్ట్, మదర్ థెరిసా ట్రస్ట్ కోశాధికారులు డి.విజయలక్ష్మి, ఎస్‌కె అమీర్ హంస, కార్యదర్శి జూలకంటి ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చలవాది మధుసూదన్ రావు, దునకా ప్రసాద్ , ట్రైనర్షుదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపిడిఒ అనురాధ

13, 14 తేదీల్లో గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13, 14 తేదీల్లో రెండు రోజులు జిపిడిపి (గ్రామ అభివృద్ధి ప్రణాళిక)పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి జి.నితిన్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, మండల వెలుగు ఆర్గనైజర్స్ (ఐ.ఎ) పాల్గొంటారని తెలిపారు.

సిపిని కలిసిన నందిగామ ఎసిపి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎసిపిగా బాధ్యతలు స్వీకరించిన ఎ.బి.జి.తిలక్ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీల నేపథ్యంలో కాశీబుగ్గ ఎస్‌డిపిఒగా విధులు నిర్వహిస్తున్న తిలక్‌ని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో నందిగామ ఎసిపిగా నియమించారు. ఈ సందర్భంగా నందిగామ ఎసిపి కార్యాలయంలో సిపిని కలిసి మొక్కను అందించారు.

ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, అధ్యక్షులు కొండలరావు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - గంపలగూడెం: సోమవారం రాత్రి స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల స్థాయి మహాసభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఈ సుందరయ్య సమక్షంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. అధ్యక్షునిగా పోతరాజు ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా గొర్రాజు కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా పి.విజయ్, సహాధ్యక్షులుగా పి.హనుమంతరావు, కె.రజని, కోశాధికారిగా పి.కృష్ణయ్యతో పాటు మరో ఏడుగురు కార్యదర్శులు ఏకగ్రీవమయ్యారు. ఎం.కొండలను ఆడిటర్‌గా ఎన్నుకున్నారు.

చిల్లకల్లు పంచాయతీ పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పంచాయతీల పరిశీలనలో భాగంగా మండలంలోని చిల్లకల్లు గ్రామ పంచాయతీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్, విస్తరణాధికారి కె.పద్మావతి మంగళవారం పర్యటించారు. ఈ పర్యటనలో చిల్లకల్లు గ్రామ పంచాయతీకి సంబంధించి షాపులను, హోటల్స్‌ను, హైవే అండర్ పాస్ గోడలకు ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, సినిమా పోస్టర్లు తొలగించి గోడలకు తెల్ల రంగు వేయించారు.

అడ్మిషన్ ఫీజు చెల్లింపు గడువు పెంచాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : తిరస్కరణకు గురైన అడ్మిషన్ల వివరాలు తెలుపుతూ ఫీజు చెల్లింపు గడువు కొనసాగించాలని గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ డైరెక్టర్‌కి పిటిఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కరిసే మధు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఓపెన్ టెన్త్, ఇంటర్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల విషయంలో సమయానుకూలం దాటడంతో తిరస్కరించిన అడ్మిషన్లు, రిజిస్ట్రేషన్ అయిన అడ్మిషన్లు ఎక్కువ మొత్తంలో ప్రతి జిల్లా నుంచి ఉండటంతో, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి, అడ్మిషన్ ఫీజు కట్టుకోవడానికి అవకాశం కొనసాగించేలా వెంటనే స్పందించి అనుమతించాలని కోరారు.

బాలికలకు దుస్తులు అందజేస్తున్న మాధురి

కుటుంబ సలహా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు రాజుపేటలోని కుటుంబ సలహా కేంద్రాన్ని తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారిణి కె.మాధురి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ కారణాలతో ఈ కేంద్రంలో ఆశ్రయం పొందిన మహిళలు, బాలికలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వం మహిళలకు తాత్కాలిక ఆశ్రయం కోసం ఏర్పాటుచేసిన కుటుంబ సలహా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడికి వచ్చేవారికి వసతి కల్పించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఆ కేంద్రంలోని బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి సత్యవతి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండల కేంద్రంలో స్థానిక రైతు సేవ కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు ఎంపిటిసి గద్దల మల్లయ్య, కూటమి నాయకులు నాదెండ్ల నాగమణి, అబ్బినేని బాబు, జనసేన నాయకులు షేక్ యాసిన్, అడపా శ్రీనివాస రావు, పంచాయతీ సెక్రటరీ హరికృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి జమలయ్య, డిసిఎంఎస్. శ్రీను, రవి, గ్రామ వ్యవసాయ సహాయకులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన

ప్రజాశక్తి - కంచికచర్ల : విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కంచికచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త మందా వజ్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు పేరిట ఒకేసారి 6,072 కోట్లు భారాన్ని సామాన్య ప్రజలపై మోపడం అత్యంత దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ సబ్ స్టేషన్‌లో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కొట్టూరు రవిబాబు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపండి

విద్యా శాఖాధికారికి యూనియన్ నేతల వినతి

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై జిల్లా కార్యదర్శి ఎం.సారక్క మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఏవిజె రామరావును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల పైన రాజకీయ వేధింపులతో కార్మికులను తొలగింపులు ఆపాలని ఉద్యోగ భద్రత కల్పించాలని వేతనాలు ధరలు పెరుగుదలకు అనుగుణంగా పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలు పెంచాలని ఆమె కోరారు ఉచిత గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని, స్కూల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలని ,ప్రమాద బీమా కల్పించాలని చనిపోయిన వారికి 20 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియ ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కూళ్లలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను స్కూల్లో పనిచేస్తున్న ఆయాలను (శావెంజర్స్) తొలగింపులు పెరిగాయన్నారు.గత వైసీపీ ప్రభుత్వం కూడా ఇదే మాదిరిగా కార్మికులపై వేధింపులకు పాల్పడిందని సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాడి కోర్టుకు వెళ్ళి కార్మికుల ఉపాధిని కాపాడుకుందని ఆమె గుర్తు చేశారు రాజకీయ విధింపులతో వర్కర్స్ ను తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 5వ తేదీనే వేతనాలు బిల్లు ఇవ్వాలని ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూచార్జీలు పెంచాలని కనీసం 20 రూపాయలు మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అలాగే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. .ఈ కార్యక్రమంలో మచిలీపట్నం సిఐటియు కార్యదర్శి సిహెచ్ జయరావు, లలిత కుమారి సుందరమ్మ, చంటి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కంకిపాడు కార్యదర్శిగా నరేష్

ప్రజాశక్తి-కంకిపాడు: సిపిఎం కంకిపాడు మండల ఆరో మహాసభ జంపాన నాగేశ్వరరావు నగర్‌లో జరిగింది. మహాసభ సందర్భంగా పార్టీ పతాకాన్ని మహిళా సంఘం సీనియర్ నాయకురాలు చిక్కవరపు నాగేశ్వరమ్మ ఎగురవేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా టి.నరేష్, సభ్యులుగా జి కుమారి, వి శివశంకర్, వి జాను మోజెస్, జె రవి, సిహెచ్ శ్రీహరి, వి మరియదాసు, ఎం చంటిబాబు, పి దుర్గాప్రసాద్, వి రమేష్, వి సునీత ఎన్నికయ్యారు. కంకిపాడులో అగ్నిమాపక కేంద్రం, శాశ్వత పసువు కొనుగోలు కేంద్రం, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని, రోడ్లు బాగు చేయాలని, గ్రామాల్లో ఆక్రమణకు గురవుతున్న శ్మశానాలను సర్వే చేయించి ఫెన్సింగ్ వేయించాలని మహాసభ తీర్మానించింది. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంపు, ఇసుక దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మద్యం షాపులకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. బుడమేరు, కృష్ణానది వరదల వల్ల ముంపునకు గురైన పంటలకు ఇచ్చిన నష్టపరిహారం నామమాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శివనాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు పి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వృద్ధులు, అనాధలను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమని నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమ మేనేజర్ లంకపల్లి పురుషోత్తం అన్నారు. మంగళవారం స్థానిక మందపాడులోని నిరాశ్రయుల వద్దుల ఆశ్రమంలో కంచర్ల బిక్షం, పుష్పావతిల 33వ వర్ధంతి వారి జ్ఞాపకార్ధం వారి కుమారుడు కంచర్ల మహేష్ దంపతులు నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ స్నేహితులు, వృద్ధులు పాల్గొన్నారు.

మహిళల జీవన ప్రమాణాల పెంపునకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించి వారి జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మంగళవారం స్థానిక బందరు మండలం మహిళా సమాఖ్య కార్యాలయం ఆకస్మికంగా సందర్శించి, స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ఓపెన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో ఆరా తీశారు. మొత్తం 1,111 ఉత్పత్తులు నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 359 ఉత్పత్తులను ఓ ఎన్ డి సి లో నమోదు చేశామని డిపిఎం (లీప్ హుడ్) కనకారావు కలెక్టర్‌కు వివరించగా, ఈ ప్రక్రియ ఆలస్యం కావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

డిపిఒను కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి-చల్లపల్లి: కృష్ణాజిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) అరుణను చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన అరుణను మచిలీపట్నం డీపీఓ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్‌తో పాటు ఈఓ పీవీ.మాధవేంద్రరావు ఉన్నారు.

అల్పపీడనంతో రైతుల్లో వణుకు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఖరీఫ్ ప్రారంభమైన నాటినుండి ఒడిదుడుకులతో సాగిన సాగు తీరా పంటలు పండి చేతికి వస్తాయనుకునే తరుణంలో అల్పపీడనం ఏర్పడడం అది వాయుగుండంగా మారి తుఫానుగా మారుతుందని వార్త రైతులను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తుంది. తమిళనాడు శ్రీలంక ప్రాంతాలలో ఈ అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ దక్షిణ కోస్తా రాయలసీమ మీదే దాని ప్రభావం ఉంటుందని హెచ్చరించడంతో పంటలు పండి కోతకు వచ్చే సమయంలో చినుకుపడ్డ నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమాత్రం కొద్దిగా గాలి వీచిన పంట పొలాలన్నీ నేలకు ఒరిగే అవకాశం ఉంది. దీనితో పంటలు నీట మునిగి పూర్తిగా నష్టం వాటిల్లే పరిస్థితి ఉంటుంది. ఇప్పటిదాకా అనేక కష్టాలకు వచ్చి అప్పులు చేసి పంట కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు ఈ అల్పపీడనం కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.

కేంద్రీయ విద్యాలయలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: భిన్నత్వంలో ఏకత్వం గల దేశం భారతదేశమని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో 7బి విద్యార్థులు మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలైన ఆహారాల్ని తినే సంప్రదాయం ఉందన్నారు. మనం ఏ రాష్ట్రంలో ఉన్న మనమంతా భారతీయులు అని చాటి చెప్పే విధంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. దేశంలోని అన్ని రకాల వంటకాలతో చిన్నారులు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

రూ.2.80 కోట్లతో రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉయ్యూరు: కూటమి ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చి పనులు ప్రారంభించామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రూ.2.80 కోట్ల నిధులతో ముదునూరు-ఎగినపాడు వయా సాయిపురం ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణానికి బోడె ప్రసాద్ మంగళవారం శంకు స్థాపనచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు, అంతర్గత రోడ్లు సైతం అధ్వాన స్థితికి చేరుకున్నాయని, రోడ్లన్నీ గుంతల మయంగా తయారై ప్రజలు ఇబ్బందులపాలయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. సాయిపురం సర్పంచ్ జాన్సాప్, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షు డు యెనిగళ్ల కుటుంబరావు, ఉయ్యూరు చైర్మన్ సత్యనారాయణ, టిడిపి నాయకుడు జ్ఞానశేఖర్, జనసేన సమన్వయకర్త ముప్పారాజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఊసేలేని బడ్జెట్ : విద్యాసాగర్

ప్రజాశక్తి-గన్నవరం: ఎట్టకేలకు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం 2,94,427 కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి అరకొర కేటాయింపులే చేసిందని, ఉద్యోగుల ఊసే లేదని ఎస్టియు రాష్ట్ర కార్యదర్శి దేవపల్లి విద్యాసాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రాజీవ్ నగర్, దాబాజీగూడెం, చింతలపేట, చెంచుల కాలనీ, రాయినగర్ పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించారు. ప్రస్తుత బడ్జెట్లో మొత్తం విద్యారంగానికి కేటాయించిన 32,235కోట్లుగాని కేవలం పాఠశాల విద్యకు కేటాయించిన 29,909 కోట్లు గాని విద్యారంగ ప్రగతికి ఏమాత్రం సరిపడవని మొత్తం బడ్జెట్లో పాఠశాల విద్యకు కేటాయింపులు పది శాతం కూడా దాటలేదని ఇది బడుగు బలహీన వర్గాల పిల్లలపై సవతితల్లి ప్రేమను తెలుపుతుందని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వం ఉద్యోగులకు 21,980 కోట్లు బకాయిలు పెట్టిందని చెప్పారని వాటి చెల్లింపుల ప్రస్తావన ఈ బడ్జెట్లో ఎక్కడా లేదన్నారు. అలాగే పన్నెండవ వేతన సవరణకు, డిఎ బకాయిలు, అరియర్స్,పెండింగ్ పియఫ్, ఏపీజియల్ఐ లోన్లు, పాతపెన్షన్ అమలుకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా కూటమి సర్కారు ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దోవర్ సురేష్ , మండల అధ్యక్షులు మోటూరు ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రావెళ్ల ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి టీమ్‌పై అవగాహన తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-గుడివాడ: ప్రతి విద్యార్థిని శక్తి టీమ్‌పై అవగాహన కలిగి ఉండాలని గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ సిహెచ్ నాగ ప్రసాద్ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా ఎస్పి ఆర్ గంగాధర రావు ఆదేశాల మేరకు గుడివాడ ఇన్చార్జి డిఎస్పి ఎండి అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో ఆధ్వర్యంలో మంగళవారం గుడివాడ టౌన్ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో శక్తి టీమ్‌పై ఎన్ఎస్ఎస్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుడ్ టచ్ మరియు బాడ్ టచ్, డయల్ 112, సోషల్ మీడియా, చైల్డ్ మ్యారేజ్ గురించి శక్తి టీమ్ గురించి అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జాస్మిన్, శక్తి టీం సభ్యులు మహిళా కానిస్టేబుల్ స్వర్ణలత, హోంగార్డు రాజకుమారి పాల్గొన్నారు.

నాల్గో రోజుకు రైతుల దీక్షలు

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వా వరి సాగుకు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని బంటుమిల్లి సెంటర్‌లో చేపట్టిన దీక్షలు మంగళవారానికి నాల్గో రోజుకు చేరుకున్నాయి. కృత్తివెన్ను మాజీ ఎంపిపి వలవల సత్యనారాయణ, నాదెండ్ల సుబ్రహ్మణ్యం దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధనరావు, లంకదాసుల అజయ్ ఘోష్, వెంట్రపాటి సురేష్, రాంబాబు, ప్రత్తి లక్ష్మణరావు, కంఠమనేని మురళీమోహన్, సుంకర వెంకన్న, యడ్లపల్లి పెద్దిరాజులు, బండెడ్డి వీరాంజనేయులు, ప్రత్తి చంటి, యర్రా రమేష్, సుంకర పాములు, వంగలరాజా తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామికి పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పండరీపురం తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగిన దేవాలయం మచిలీపట్నం పాండురంగ దేవాలయం అని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం మంత్రి కుటుంబ సమేతంగా శ్రీ పాండురంగ స్వామివారిని దర్శించుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. పండరీపురం తర్వాత అత్యంత ప్రాముఖ్యత కలిగిన దేవాలయం మచిలీపట్నంలో ఉండడం గొప్ప విషయమన్నారు. ఈ నెల 13వ తేదీన స్వామి వారి రథోత్సవం జరుగుతుందన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారిశుధ్యము, మంచినీరు, విద్యుత్తు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని గృహ, వ్యాపార సముదాయాలకు సంబంధించిన విద్యుత్ మీటర్లను తనిఖీ చేసినట్లు ఎలక్ట్రికల్ ఏఈ దేవదాసు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కృష్ణానాయక్‌తో కలిసి 30 మంది విద్యుత్ శాఖ అధికారుల సమక్షంలో బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాలలోని గృహ మరియు వ్యాపార సముదాయాల విద్యుత్ మీటర్లను పరిశీలించినట్లు తెలిపారు. మొత్తం 2035 మీటర్లను తనిఖీ చేయగా అందులో 319 మీటర్లు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు తేలిందన్నారు. ఈ అదనపు లోడు వినియోగిస్తున్న సర్వీసులకు రూ.97,472 జరిమానా విధించినట్లు తెలిపారు.

15 నుండి బాలోత్సవం పిల్లల పండుగ

200 పాఠశాలల నుండి పది వేల మంది విద్యార్థులు - 20 అంశాలలో పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు అమరావతి బాలోత్సవం అధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు 'బాలోత్సవం పిల్లల పండగ' నిర్వహించనున్నట్లు అమరావతి బాలోత్సవ అధ్యక్షులు ఎస్.పి.రామరాజు తెలిపారు. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఏడో పండుగ నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రగతికి మార్గం - శాస్త్ర విజ్ఞానం అనే థీమ్‌తో ఈ సారి బాలోత్సవ్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా నుండి 200 స్కూల్స్ నుండి 10 వేల మంది విద్యార్థులు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 20 అంశాల్లో 60 విభాగాలుగా విద్యా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఉచితంగా భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ప్రారంభిస్తారని అన్నారు. అతిథులుగా

శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, శాసన సభ్యులు గద్దె రామమోహనరావు, బాలోత్సవ్ వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్ బాబు, పాల్గొంటారని అన్నారు. ఆరు వేదికలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయని అన్నారు. అకడమిక్, కల్చరల్ విభాగాల్లో పోటీలుంటాయని అన్నారు. విలేకరుల సమావేశంలో అమరావతి బలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, సభ్యులు గుమ్మా సాంబశివరావు, విద్యాకన్నా, వెంకట్రావు, యార్లగడ్డ సుబ్బారావు, వెంకట్ పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరించారు.

10 గిగా వాట్ల సామర్థ్యంతో ఇంధన ప్రాజెక్టులకు ప్రణాళికలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థ, సెరెంటికా రెన్యూవబుల్స్, 10 గిగావాట్ల (బిడబ్ల్యు) సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి తన ప్రణాళికలను రూపొందించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.ఫణి కుమార్ తెలిపారు నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం ఈ ప్రాంతంలో పర్యావరణ అనుకూల వృద్ధిని పెంపొందించడంలో కంపెనీ నిబద్ధతను ఈ కార్యక్రమం నొక్కి చెబుతుందన్నారు. 2030 నాటికి 72 గిగా వాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో, రాష్ట్ర హరిత లక్ష్యాలకు దోహదపడేందుకు సెరెంటికా వంటి పరిశ్రమ ప్రముఖులకు మార్గాలను తెరుస్తోందని తెలిపారు. ఈ 10 గిగా వాట్ ప్రాజెక్టుల ద్వారా, సెరెంటికా ఈ ప్రాంతంలో స్థిరమైన పారిశ్రామిక వృద్ధికి పునాదిని వేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో తిరువూరు విద్యార్థినికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - తిరువూరు : వ్యాసరచన పోటీల్లో తిరువూరు శ్రీనిధి జూనియర్ కళాశాల విద్యార్థికి ప్రథమ బహు మతి లభించింది. శ్రీ సత్య సేవా సమితి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో తమ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తుల్లూరి దీపిక డివిజన్ స్థాయి లో జరిగిన వ్యాసరచన పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ వేగి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు దీపికను అభినందించారు నిందించారు.

'సుజనాను విమర్శించే అర్హత వెలంపల్లికి లేదు'

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గానికి వేస్ట్ ఫెలో వెలంపల్లి శ్రీనివాస్ అని, పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరిని విమర్శించే అర్హత వెలంపల్లి శ్రీనివాసరావుకు లేదని బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ఘాటుగా విమర్శించారు. భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో ఇటీవల ఎన్డీఏ కూటమిలో చేరిన కార్పొరేటర్లతో కలిసి అడ్డూరి శ్రీరామ్ మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం టిడిపి కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) మాట్లాడుతూ తన సామాజిక వర్గానికి న్యాయం చేసుకుంటూ ఇతరులను ప్రజా ప్రతినిధులను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ అభివృద్ధికి అడ్డంపడ్డ వెలంపల్లిని నియోజకవర్గ ప్రజలు తన్ని తరిమేశారన్నారు.

సినీనటుడు పోసానిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భవానీపురం : డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులను అసభ్యంగా ఇష్టం వచ్చినట్లు దూషించిన సినీ నటుడు పోసాని కృష్ణమురళిని వెంటనే అరెస్టు చేయాలని భవానీపురం సిఐ ఉమామహేశ్వరరావుకు జనసేన ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ జనసేన నాయకులతో కలిసి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాడిత శంకర్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైసిపి పంచన చేరిన సినీ నటుడు పోసాని కృష్ణ మురళి ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడని ఆన్నారు. తాము ఫిర్యాదు చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి నుండి చెస్ పోటీలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈ నెల 13, 14 తేదీలు (రెండు రోజుల) పాటు పిఎస్‌సిఎంఆర్ కళాశాలలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల సెక్రటరీ అమర్ సుధీర్ తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ, యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆదేశాల మేరకు విజయవాడ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్‌తో యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు చెస్ (మెన్ అండ్ ఉమెన్స్) పోటీలు నిర్వహణ సందర్భంగా మంగళవారం కళాశాలలో సంబంధిత పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అమర్ సుధీర్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి దాదాపు 300 మందికి పైగా విద్యార్థులు చెస్ పోటీలలో పాల్గొంటున్నారని అందుకు ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషమని, కళశాల ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. చెస్ పోటీల పర్యవేక్షకుడిగా యూనివర్సిటీ నుండి డాక్టర్ జి.పి.రాజు, సెక్రటరీ జె.ఎన్.టి.యు.కె ఇంటర్ కాలజియెట్ టోర్నమెంట్స్

చెస్ పోటీల పోస్టర్‌ను విడుదల చేస్తున్న పిఎస్‌సిఎంఆర్ కళాశాల యాజమాన్యం

వ్యవహరిస్తారని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డిసెంబర్ 4 నుండి 7 వరకు వెల్‌టెక్ యూనివర్సిటీ చెన్నైలో జరగబోయే టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ కాజా రాఘవయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరవణ కుమార్, అకాడమిక్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్ మణికంఠ, ఫిజికల్ డైరెక్టర్ విక్టర్ జాన్సన్ పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ ఎన్నికల ప్రచారం

విజయవాడ : మధిర బ్రాంచ్ కొండపల్లి సెక్షన్లో ఎస్ఎస్ఇ/పిడబ్ల్యుఎవై/కెఐ ఇంజనీరింగ్ కార్మికులు, ఎస్ఎస్ఇ/ఒహెచ్ఇ/టిఆర్‌డి/కెఐ డిపార్ట్‌మెంట్ కార్మికులను వారి వారి సమస్యలను తెలుసుకుంటూ మజ్దూర్ యూనియన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా డివిజనల్ రథసారథి ఎడిఎస్, ఇసిసిఎస్ ఎమ్‌డి, చిలుకు స్వామి, డోర్నకల్ బ్రాంచ్ సెక్రటరీ, ఇసిసిఎస్ డైరెక్టర్ అంజి యాదవ్, కాజీపేట సెంట్రల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ సెక్రటరీ రాజేంద్ర, వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్, మధిర బ్రాంచ్ చైర్మన్ వెంకట్, సెక్రటరీ సంపత్ రావు ట్రెజరీ కిరణ్ కుమార్, ఇసిసిఎస్ డెలికేట్ జి.కిషోర్, వర్కింగ్ కమిటీ మెంబర్స్ సీనియర్ నాయకులు సైదులు, మధుర బ్రాంచ్‌లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఎలక్షన్ క్యాంపెయి నింగ్ విజయవంతం చేశారు. డాక్టర్ సిహెచ్.శంకర్రావు, పి.రవీంద్ర నాయకత్వం వర్ధిల్లాలని పిలుపునిచ్చారు.

లెక్సలిగిస్ ఎఐ ఫీచర్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : లీగల్ టెక్నాలజీ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)లో అగ్రగామిగా ఉన్న లెక్సలిగిస్ ఎఐ విప్లవాత్మక ఫీచర్ ఇంటరాక్ట్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇంఛార్జి ఎం.మధు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్యుమెంట్ వర్క్‌ఫ్లోలను న్యాయ నిపుణులు నిర్వహించడం, విశ్లేషించడం, ఆప్టిమైజ్ చేసే విధానాల్లో కొత్త మార్పు తీసుకురావడానికి ఇది రూపొందించ బడిందని పేర్కొన్నారు. శక్తివంతమైన న్యాయ పరిశోధన సాధనంగా మరింత అభివృద్ధి చేస్తూ ఇంటరాక్ట్ ఒక కొత్త పరిణామాన్ని ఆవిష్కరిస్తోందని తెలిపారు. ఆధారిత ఫీచర్లను జోడించి, న్యాయ ప్రక్రియలను మరింత తెలివిగా, వేగంగా, సమర్థవంతంగా చేస్తుందని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మత్తు పదార్థాలు సేవించిచడం వలన భవిష్యత్తు అంధకారం అవుతుందని రెడ్డిగూడెం ఎస్ఐ బి.మోహన్‌రావు అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య ద్వారా ఉన్నత స్థాయిలోనికి వెళ్లిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. మత్తు పదార్థాలైన గంజాయి, డ్రగ్స్, కొకైన్, పాన్ పారాగ్, మత్తుపానియాలను వాడటం వల్ల ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయాలు, వాడకాలను వాడొద్దని సూచించారు. ముఖ్యంగా చదువు ఆన్లైన్ లో ఏం చేస్తున్నారు ఎవరితో చాటింగ్ చేస్తున్నారో వంటి విషయాలు పట్ల జాగ్రత్త వహించి లవ్ ట్రాప్‌లు, ఫేక్ స్నేహాలు ఇలాంటి వంటి బారిన పడకుండా రక్షించుకోవాలని సూచించారు. ఈ విషయాల్లో తల్లిదండ్రులే స్వయంగా చొరవ తీసుకోవాలని

తెలిపారు. సైబర్ నేరాల ప్రతినిత్యం ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ఆన్లైన్‌లో లావాదేవీలు జరిగేటప్పుడు కానీ ఏదైనా ప్రభుత్వం స్కీములు, ప్రైవేటు స్కీములు వంటివి లావాదేవీలు జాగ్రత్త వహించి ఒటిపిలు చెప్పటం గాని మన అకౌంట్ వివరాలు చెప్పడం గానీ చేయకూడదని తెలిపారు. మరి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ఈ ఆన్లైన్ యాప్‌ల పేరిట జరిగే మోసాలు గురించి వివరించారు. చట్టాలను మనం గౌరవించి పాటిస్తేనే చట్టాలు, వ్యవస్థలు సమర్థవంతంగా చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మశీల, ప్రకాష్ (మాస్టర్) స్కూల్ కమిటీ చైర్మన్ నమ్మిక శోభన్ బాబు సచివాలయ మహిళా పోలీసులు డి.లక్ష్మి, వై.శ్రీలక్ష్మి కానిస్టేబుల్ రమేష్ సత్య అంగన్వాడీ టీచర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా వంతెన

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని కొత్తగూడెం చిలుకూరి వారి గూడెం గ్రామాల మధ్య బుడ మేరు వాగుపైఏర్పాటు చేసిన వంతెన కుంగిపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందో ళనకు గురవుతున్నారు. రెండు దశాబ్దాలకు పైగా నిర్మించిన ఈ

వంతెనపై రెండు గ్రామాలకు చెందిన రైతులతో పాటు పలు గ్రామాలకు చెందిన వారు, పలు వాహనదారులు ఈ వంతెన పైనుండే రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రెండేళ్ల క్రితం వచ్చిన వర్షాలకు వాగు ప్రవాహానికి కొంతమేర ఒరిగి విరిగిపడింది. దీంతో వంతెనకు రెండువైపులా రాకపోకలు సాగించకుండా గోడలను కట్టారు. దీంతో చిలుకలు వారి గూడెం గ్రామస్తులు మరొక చోటకు వెళ్లాలంటే పుల్లూరు వైపు నుండి వెళ్లాల్సి ఉంది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు పుల్లూరు వైపు నుండి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండటంతో వంతెనకు ఏర్పాటు చేసిగోడలను తొలగించి ప్రమాదమని తెలిసినా రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల వచ్చిన వరదలు వంతెనపైకి రావటంతో బ్రిడ్జిమరింత కుంగి మధ్యలో కొంతమేర ఇరగటంతో అగాధంలా ఏర్పడింది. రాత్రివేళ ట్రాక్టర్లు, ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు ఈ వంతెన నుండి వెళ్లాల్సి ఉండటంతో అగాధాల ఉన్న గోతులో పడితే అంతే సంగతేనని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.